ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 29, ఏప్రిల్ 2026






# ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట

**✳ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 28, ప్రభాతవార్త

ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 4 కోట్ల 40 లక్షల రూపాయలతో గెర్రెగూడెం నుండి నర్సింగాపూర్ మీదుగా కాజిపల్లి వరకు చేపట్టిన బి.టి. రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు కాంట్రాక్టర్ ద్వారా ఇండ్లు

మిగతా 2లో..



# సింగరేణి స్టోర్స్ దొంగతనం మిస్టరీ ఛేదన..
# 25 బ్యాటరీలతో ముగ్గురు అరెస్ట్

**★ పట్టుదలతో కేసు ఛేదించిన మందమర్రి పోలీసులు**



మందమర్రి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త

సింగరేణి ఏరియా స్టోర్స్‌లో జరిగిన బ్యాటరీల దొంగతనం కేసును మందమర్రి పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వివరాల ప్రకారం, ఏప్రిల్ 25న సింగరేణి ఏరియా స్టోర్స్‌లో బ్యాటరీలు దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఎస్ఐ జి. నరేష్ సిబ్బందితో కలిసి నార్లాపూర్ సమీప హైవేపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక ఆటో అనుమానాస్పదంగా వెనుదిరిగి పారిపోవడానికి ప్రయత్నించింది. పోలీసులు వెంటనే ఆటోను అడ్డుకుని తనిఖీ చేయగా, అందులో మిగతా 2లో..

# ప్రతి ప్రయాణం సురక్షితం కావాలి

**హెల్మెట్ తప్పనిసరి : ఎస్పీ నితిక పంత్**

కెరమెరి,ఏప్రిల్ 28, ప్రభాతవార్త :

ప్రతి ప్రయాణం సురక్షితం కావాలని జిల్లా ఎస్పీ నికిత పంత్ అన్నారు మంగళవారం పోలీసులు మీకోసం అరైవ్ అలైవ్ కార్యక్రమాల భాగంగా కెరమెరి మండలం అగర్వాడ గ్రామంలో కెరమెరి పోలీసుల ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ గ్రామస్తుల సహకారంతో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ నితిక పంత్ హాజరై, గ్రామస్తులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గ్రామస్తుల చొరవతో గ్రామంలో 100 హెల్మెట్లు అందించాలనే సంకల్పం తీసుకోవడం అభినందనీయమని ఎస్పీ ప్రశంసించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ద్విచక్ర వాహనదారుడు మిగతా 2లో..



# కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ప్రజాప్రతినిధులు

**సిర్పూర్ నియోజకవర్గ ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై విస్తృత చర్చ**



కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :

హైదరాబాద్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌ను కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, సిర్పూర్ మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప,మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గంలో నెలకొన్న వివిధ ప్రజా సమస్యలను కోనేరు కోనప్ప కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరమని వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై సమగ్రంగా చర్చించారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం, యువతను పార్టీ వైపు ఆకర్షించడం, కార్యకర్తలకు మరింత ప్రోత్సాహం అందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణపై రూపురేఖలు రూపొందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ కార్యకర్తలు ప్రజలతో మరింత అనుబంధం మిగతా 2లో..

# నిరుపేదల గృహ కల సాకారం దిశగా చర్యలు

**అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

– బెల్లంపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త 2లో..



# ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట

**(మొదటిపేజీ తరువాయి)**

నిర్మించేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సంబంధించి బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా డిఎంఎస్‌టి, సిఎస్ఆర్, సిఆర్ఆర్ నిధుల ద్వారా గోత్రాల వాడకు 1 కోటి 60 లక్షల రూపాయలు, దాంపూర్ గ్రామానికి 38 లక్షల రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్‌వెల్స్ మంజూరు చేసి ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నర్సింగాపూర్ గ్రామంలో 19 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందని, అర్హులైన లబ్ధిదారులకు మరిన్ని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హత గల నిరుద్యోగ యువతకు విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమారం మండలంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, ఈ క్రమంలో రహదారుల నిర్మాణానికి సంబంధించి తెలిపారు. మండలంలో చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కొరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వసతి గృహం, అదనపు తరగతి గదులు, గ్రంథాలయాల ఏర్పాటుతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలలో చేపట్టిన పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యుత్ కనెక్షన్ మంజూరులో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో దాంపూర్ గ్రామంలో 15 ఇండ్లు పూర్తి చేయబడ్డాయని, 38 ఇండ్లు స్లాబ్ స్థాయిలో ఉండగా 72 ఇండ్ల పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అర్హత గల వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమీపంలోని ఇసుక రీచ్ నుండి ఇసుకను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డులు అర్హత గలవారికి అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రయాణం సురక్షితం కావాలి

**(మొదటిపేజీ తరువాయి)**

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. చిన్నపిల్లలు ప్రయాణించే సమయంలో కూడా హెల్మెట్ ధరింప చేయాలని, వాహనంపై వెనుక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని తెలిపారు. వ్యక్తిగత భద్రతా జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. తదనంతరం గ్రామస్తులతో కలిసి రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో గ్రామస్తుల బైక్ ర్యాలీ ని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కెరమెరి ఎస్సై మధుకర్, గ్రామ సర్పంచ్ రోజా సోనాజీ , గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ప్రజాప్రతినిధులు

**(మొదటిపేజీ తరువాయి)**

పెంచుకొని పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి సేవ చేయాలని, పార్టీకి బలమైన పునాది ఏర్పడేలా కృషి చేయాలని కోరారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఘనంగా కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సురేఖ వివాహ వార్షికోత్సవ వేడుకలు

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుసురేఖ వివాహ వార్షికోత్సవ వేడుకలు లక్షెట్టిపేట మున్సిపాలిటీలో అత్యంత వేడుకగా జరిగాయి. స్థానిక ఐబీ గెస్ట్ హౌస్ వేదికగా మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అందరూ కలిసి కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... మన ప్రియతమ నాయకులు, నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే మన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సురేఖమ్మ కి హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుంటూ, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఈ ఆదర్శ దంపతులు నిండు నూరేళ్లా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మేము ఆ కాంక్షిత దైవాన్ని కోరుకుంటున్నాము. వారి నాయకత్వంలో మున్సిపాలిటీతో పాటు మన నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని మేము నమ్ముతున్నాము అని తెలిపారు..ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ఆరిఫ్, సీనియర్ నాయకులు చెల్ల నాగభూషణం, చింత అశోక్ కుమార్, దొంత నర్సయ్య, వెంకట్ స్వామి గౌడ్, షాహిద్ అలీ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# నిరుపేదల గృహ కల సాకారం దిశగా చర్యలు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**



అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండు పడక గదుల ఇండ్ల పథకం కింద ఇళ్లను పారదర్శకంగా అందజేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి మండల కేంద్రంలో నిర్మితమైన రెండు పడక గదుల ఇండ్లను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ నాణ్యత, మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, రహదారి సదుపాయాలు, పారిశుధ్యం వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే సరిదిద్దాలని, లబ్ధిదారులు నివసించేందుకు పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు సురక్షితమైన నివాస వసతి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రెండు పడక గదుల ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, సమాజంలో సమానత్వం పెంపొందుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబాన్ని గుర్తించి, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, నిజంగా అర్హులైన వారికి మాత్రమే ఇళ్ల కేటాయింపు జరగాలని స్పష్టం చేశారు. ఇళ్ల పంపిణీ ప్రక్రియలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్, సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి కార్యాలయ పనితీరును సమీక్షించారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తుల పరిశీలన, పరిష్కార విధానాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు సేవలు అందించడంలో ఎటువంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తును సమయానికి పరిష్కరించేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భూ సంబంధిత సమస్యలపై నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను సంబంధిత రికార్డులతో సరిచూసి, క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టి త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూమి వివాదాలు, పట్టాదారుల సమస్యలు, రికార్డు లోపాలను ప్రాధాన్యతగా తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సింగరేణి స్టోర్స్ దొంగతనం మిస్టరీ ఛేదన..

# 25 బ్యాటరీలతో ముగ్గురు అరెస్ట్

**(మొదటిపేజీ తరువాయి)**

25 బ్యాటరీలు లభించాయి. విచారణలో అవి సింగరేణి స్టోర్స్ నుంచే దొంగతనం చేసినవని తేలింది. నిందితులు ధనకుంట్ల మునియప్ప (19), జన్నే నరేంద్ర (19), గాజుల శివప్రసాద్ (20)గా గుర్తించారు. వీరు ఏప్రిల్ 20 అర్ధరాత్రి సమయంలో స్టోర్స్‌లోకి చొరబడి బ్యాటరీలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి రిమాండ్‌కు పంపించారు. కేసును ఛేదించిన ఎస్ఐ నరేష్‌తో పాటు సిబ్బంది రాకేష్, మహేష్, కృష్ణ, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.

## టిజిడబ్ల్యుడబ్ల్యుసి ఆధ్వర్యంలో
# అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం

జన్నారం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం సందర్భంగా చనిపోయిన కార్మికులను స్మరించుకుందాం బ్రతికున్న వారి కోసం పోరాడుదాం అనే నినాదంతో మంగళవారం రోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు 3 సంవత్సరాలు గడుస్తున్నా గల్ఫ్ కార్మికులు ఇచ్చిన హామీలు అమలు కాక గల్ఫ్ కార్మికుల కోసం చేసిందేమీ లేదని, ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో రాష్ట్రం ఏర్పడి నుంచి చనిపోయిన శవపేటికలు 1900కు పైగా రావడం జరిగిందని వారి కుటుంబాలను ప్రభుత్వాలే ఆదుకోవాలని కోరారు. గల్ఫ్‌లో చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షలు ఎక్స్ గ్రేషియా కొన్ని కుటుంబాలకు ఇచ్చినప్పటికీ, ఇంకా ఇవ్వాల్సిన మిగతా కుటుంబాలకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన వలస కార్మికులను కనీస ఆసరా ఇస్తూ వారిని ఆదుకునే అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా వారికి ప్రభుత్వ లోన్ ద్వారా కొంత సొమ్మును ఇస్తూ వారి జీవనాధారానికి సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులను చిన్నచూపు చూస్తే గడపగడపకు వెళ్లి ప్రతి గల్ఫ్ కార్మికుని ఏకం చేసి పసుపు బోర్డు తరహాలో గల్ఫ్ బోర్డు ఎన్నారై పాలసీ కొరకై పోరాటానికి సిద్ధమవుతామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రవాస దివస్ దినోత్సవం ప్రభుత్వమే జరిపించాలని వారు పేర్కొన్నారు. ప్రతి గల్ఫ్ కార్మికునికి ప్రభుత్వం బీమా పథకం కల్పించాలన్నారు. ముంబయి లో ఏర్పాటు చేసిన విధంగా విదేశ్ భవన్‌ను హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ (సమీకృత సముదాయం) లో పాసు పోర్టు ఆఫీస్, ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్ ఆఫీసు, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) రీజినల్ ఆఫీసు, విదేశాంగ శాఖ బ్రాంచి సెక్రెటేరియట్ లు ఉంటాయన్నారు. 38 ఏళ్లనాటి ఎమిగ్రేషన్ యాక్టు, 1983 స్థానంలో నూతన ఎమిగ్రేషన్ యాక్టు, 2021 ను తీసుకరావాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్నారైలకు ప్రాగ్జీ ఓటింగు (ప్రతినిధి ద్వారా, పరోక్ష పద్ధతిలో ఓటు వేయడం) లేదా ఆన్లైన్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గల్ఫ్ దేశాల జైళ్లలో మగ్గుతున్న భారతీయులు న్యాయ సహాయం కోసం ఎదురుచూస్తున్నారనీ, వారికీ కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించి స్వదేశానికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సేపురి గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగొండ తిరుపతి, పెరుగు మల్లికార్జున్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొలాజీ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసెట్టి తిరుపతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహమ్మద్ హస్సన్, జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎలయ్య, సత్తయ్య, వివిధ గ్రామాల గల్ఫ్ కార్మికులు అందరూ పాల్గొన్నారు.




## దగ్ధమైన మొక్కజొన్నను పరిశీలించిన ఏఈఓ

సారంగాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:



మండలంలోని అడెల్లి శివారంలో కౌలు రైతు బర్ల బీమన్న సాగు చేస్తున్న రెండెకరాల 8 గుంటల మొక్కజొన్న పంట గత వారం రోజుల కిందట విద్యుత్ నిప్పురవ్వల కారణంగా దగ్ధమైంది. మంగళవారం ఏఈఓ రాము దగ్ధమైన పంటను పరిశీలించి పంచనామా చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. పంట నష్టానికి సంబంధించి సాధ్యమైనంత వరకు పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, రైతుకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు రాజు రెడ్డి, పలువురు రైతులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసిన ఆర్లి గ్రామస్తులు

భైంసా, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

మండలంలోని ఆర్లి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేసినందుకు మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డిని దేగాం గ్రామంలోని ఆయన నివాసంలో గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలను విఠల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురళి, వీడీసీ సభ్యులు సతీష్, విష్ణు, నిలు, మధుకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కృతజ్ఞతలు తెలుపుతున్న ఆర్లి గ్రామస్తులు

## నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికిన మీసేవ నిర్వాహకులు

సారంగాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:



సారంగాపూర్ మండల నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన బి విజయ్ కాంత్ రావును మండల మీసేవ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు శివ ప్రసాద్ గౌడ్, కైసార్, మహేందర్, భూమేష్, సందీప్, మాసూద్ పాల్గొన్నారు.


డాక్టర్ సురేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు

## డాక్టర్ సురేందర్ మృతికి వైద్యుల శ్రద్ధాంజలి

భైంసా, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

పట్టణంలోని డాక్టర్ అసోసియేషన్ భవనంలో కీర్తిశేషులు డాక్టర్ సురేందర్‌కు భైంసా డాక్టర్ అసోసియేషన్, ఐఎంఏ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాల మౌనం పాటించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ ప్రాంతంలో డాక్టర్ సురేందర్ అందించిన వైద్య సేవలు ప్రజల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని, ఆయన మృతి వైద్య రంగానికి తీరని నష్టమని వైద్యులు పేర్కొన్నారు. శస్త్రచికిత్స సమయంలో ఏదైనా ఆటంకం కలిగితే వెంటనే స్పందించి తోటి డాక్టర్లకు సహాయం చేసే గొప్ప మనసున్న వ్యక్తి అని ఆయనను స్మరించుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా డాక్టర్ అసోసియేషన్, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.


గంజాయి నివారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## గంజాయి నివారణపై అవగాహన కార్యక్రమం

సారంగాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:

మండలంలోని జాం గ్రామంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు గంజా గస్తీలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంజాయి అలవాటు వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్తులకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని, వారి కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. గంజాయి సాగు లేదా రవాణా గురించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఎస్సై సంజీవ్, భరోసా ఎస్సై సుమాంజలి, జాం సర్పంచ్ కరిపే రవళి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ విజయ్‌కాంత్‌రావును సన్మానిస్తున్న మండల రేషన్ డీలర్లు.

## నూతన తహశీల్దార్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు

సారంగాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ్ కాంత్ రావును మంగళవారం మండల రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. మండలంలోని రేషన్ పంపిణీ వ్యవస్థను మెరుగుపరచడంలో తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా డీలర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు అందరూ పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

భైంసా, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

మండలంలోని దేగాం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి ముందుగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పంచరంగి జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ కాలనీలోని లుంబినీ బుద్ధ విహార్‌లో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో మాట్లాడి రూ. 20 లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్ధవనం స్పెషల్ ప్రాజెక్టు కింద బుద్ధ మందిర నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నలందా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కపిల్ వాగ్మారే, వార్డు సభ్యులు పాతర్ల నరేష్, నాగేష్, చోటు, మాజీ వార్డు సభ్యుడు హైదర్, హిందూ వాహిని గ్రామ అధ్యక్షుడు నరేష్, వీడీసీ సభ్యుడు లక్ష్మణ్, సభ్యురాలు సుప్రియ సిద్ధోధన్, జై భీమ్ సేన యూత్ అధ్యక్షుడు గంగాధర్, ఎమ్మెస్ఎఫ్ జిల్లా నాయకుడు రాచర్ల ప్రవీణ్, అజయ్, గడ్పాలె కార్తీక్, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

## కాగజ్‌నగర్‌లో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :**

ప్రజా పాలన – ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాగజ్‌నగర్ షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసుంధర డిగ్రీ కాలేజ్, బస్టాండ్ పరిసరాలు, ఆటో స్టాండ్ ప్రాంతాల్లో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.షీ టీమ్ ఇన్‌చార్జ్ డి. సునీత (ఏ.ఎస్.ఐ) విద్యార్థులు, మహిళలు మరియు చిన్నపిల్లల భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమెన్స్ సేఫ్టీ, చైల్డ్ సేఫ్టీ, జెండర్ ఈక్వాలిటీ, సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజెస్ వంటి ముఖ్య అంశాలపై వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీస్ సహాయం పొందడానికి డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ సాయికిరణ్

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పలువురు అధికారులు

**నిర్మల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేశ్ మిశ్రాను పలువురు అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సన్మానించారు. అనంతరం అధికారులు తమను తాము కలెక్టర్‌కు పరిచయం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్న వయసులో గర్భధారణ ప్రమాదకరం

**నేరడిగొండ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

బాలల భద్రతా వారోత్సవాలలో భాగంగా మండలంలోని సావర్గం, గుత్పాల గ్రామాలలో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, చిన్న వయసులో గర్భధారణ వల్ల తల్లి బిడ్డలకు ప్రాణాపాయం ఉంటుందని తెలిపారు. "మొదట చదువు తరువాత వివాహం" అనే లక్ష్యంతో బాలికలు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం స్నేహ బృందాల కార్యకలాపాలు, పోక్సో చట్టం, 1098, 181 నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, సర్పంచ్, ఉపసర్పంచ్, ఐకేపీ సీసీలు, వీవోలు, ఆశా కార్యకర్తలు, డీహెచ్ఈడబ్ల్యూ, ఎస్ఎఫ్ఎల్, ఐసీపీఎస్ సామాజిక కార్యకర్తలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**- వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయండి**

**హాజీపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

నర్సింగ్ విద్యార్థులకు షీ టీమ్స్, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో షీ టీం ఎస్సై ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమెన్ సేఫ్టీ కింగ్ ఆధ్వర్యంలో నేటి నుంచి ఆరు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్సై ఉషారాణి ముఖ్య అతిథిగా పాల్గొని, వేంపల్లి ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాల విద్యార్థులకు, మహిళలు, పిల్లల భద్రత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మరియు విద్యార్థుల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.అలాగే పిల్లల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.పని ప్రదేశంలో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ మహిళలు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, బాధితులు ఎలాంటి భయం లేకుండా ముందుకు రావాలని ఎస్సై హైమ హామీ ఇచ్చారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలనిసూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమాజ అభివృద్ధికి లింగ సమానత్వం కీలకమని పేర్కొన్నారు. మహిళలు, పురుషులు సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ద్వారా సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు.బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలు, విద్యలో అంతరాయం, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తాయని తెలిపారు. చట్టపరంగా బాల్య వివాహాలు నిషేధించబడినవని స్పష్టం చేశారు. కాబట్టి 18 సంవత్సరాల లోపు బాలికల వివాహాలు జరగకుండా సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బాల్య వివాహాలపై సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు లేదా హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.భవిష్యత్తులో నర్సింగ్ వృత్తిలో చేరి సమాజానికి సేవ చేయబోయే విద్యార్థినులు తమ వృత్తి జీవితంలో కూడా ఇటువంటి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, అధ్యాపక బృందం, మంచిర్యాల షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు శ్రవణ్ , వనిత, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎస్సై ఉషారాణి

# బెల్లంపల్లి ఆసుపత్రి అప్‌గ్రేడ్‌పై ప్రభుత్వాల నిర్లక్ష్యం

**వెంటనే 100 పడకలుగా మారాలి: ఎంసీపీఐయుఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు తీవ్ర వైద్య సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తక్షణమే 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం రోజు బెల్లంపల్లిలోని ఎంసీపీఐయు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలోని 7 మండలాలకు ఈ ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన ఆధారంగా ఉన్నప్పటికీ, సరిపడా సౌకర్యాలు, డాక్టర్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ వైద్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా ప్రకటించి ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నా కూడా ఎలాంటి పురోగతి కనిపించకపోవడం బాధాకరమన్నారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకే బెల్లంపల్లి ఆసుపత్రికి వచ్చే రోగులను మంచిర్యాల జిల్లా ఆసుపత్రికి తరలించాల్సి వస్తోందని, ఈ తరలింపుల సమయంలో ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి వెంటనే స్పందించి ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, అన్ని విభాగాల డాక్టర్లు, అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. లేకపోతే ఎంసీపీఐయు పార్టీ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆమరణ నిరాహార దీక్షకు దిగేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అచల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గం లక్ష్మి, జాడి రాజకుమార్, సబ్బని రాజశేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే దంపతులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి: మంచిర్యాల మేయర్ మధుకర్

**- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, సురేఖ దంపతుల 40వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం**

**నస్పూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

భగవంతుడి ఆశీస్సులతో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, సురేఖ దంపతులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మధుకర్ పేర్కొన్నారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖల 40వ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మేయర్ మధుకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ తూముల నరేష్ ఆధ్వర్యంలో ఈ సేవ కార్యక్రమం సాగింది. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఈ దంపతులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వార్షికోత్సవం వంటి వ్యక్తిగత వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్య జరుపుకోవడం వారి సేవా నిరతికి నిదర్శనమని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. ఆసుపత్రిలోని రోగులకు, వారి సహాయకులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్న మేయర్ మధుకర్, తూముల నరేష్

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ చంద్రయ్య

**తాండూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య అన్నారు. చౌటపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, మురికి కాలువలను పరిశీలించారు. వేసవిలో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డిపిఓ సతీష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్ కుమార్, సర్పంచు సునీత, పంచాయతీ కార్యదర్శి వసంత తదితరులు పాల్గొన్నారు.


చౌటపల్లిలో ఇందిరమ్మ ఇల్లులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎంపిడిఓ, నాయకులు

**వేమనపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. వేమనపల్లి మండలంలోని ముల్కలపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన మూడు ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం ఎంపిడిఓ కుమారస్వామి తో కలిసి ప్రారంభించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఇలాంటి పథకాల ద్వారా సామాన్య ప్రజలకు నిజమైన సంక్షేమం చేరుతుందని తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులు కొత్త ఇంటిలో సుఖ సంతోషాలతో జీవించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, స్థానిక సర్పంచ్ ఒడిల కల్యాణి సుధాకర్, డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, హౌసింగ్ ఏఈ కార్తీక్, సర్పంచులు వుప్పులపు సాయికృష్ణ, కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్, దుర్గం భాగ్య లక్ష్మి తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, నాయకులు దన్నూరి ఏమ్మాజీ, కొంపూరి రమేష్, కామెర గణేష్, ఏపీఓ మహేశ్వర్ రెడ్డి, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ రుణాల మంజూరు కోసం 64 మంది అభ్యర్థులు హాజరు

**తాండూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :**

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 64 మంది అభ్యర్థులు హాజరైనారు. ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏపీఎం శ్యామల, తాండూర్, రేచిని టీజీబీ, తాండూర్ యూబీఐ అధికారులు అభ్యర్థుల విద్యార్హత, వివిధ ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు కు 4 యూనిట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 4 యూనిట్లు, ఎస్బిఐ కి 4 యూనిట్లు, రేచిని తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు 1 యూనిట్, మొత్తం 13 యూనిట్లు మంజూరు అయ్యాయి. ఈవీ టూ వీలర్ కోసం 28 మంది, ప్యాసింజర్ ఈవీ త్రీ వీలర్ కోసం 34 మంది, ఈవి త్రి వీలర్ గూడ్స్ కోసం 7 గురు, సోలార్ పంపు కోసం ఒకరు, మిల్క్ అనిమల్ కోసం 7 గురు, మొత్తం 77 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు.



## నీటి సమస్యకు బోర్‌వెల్స్ మంజూరు

- మంత్రి వివేక్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిర్రకుంట గ్రామస్తులు

**మందమర్రి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

మందమర్రి మండలం చిర్రకుంట గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి గ్రామానికి రెండు బోర్‌వెల్స్ మంజూరు చేశారు, మంజూరైన బోర్‌వెల్స్ పనులను శుక్రవారం స్థానిక సర్పంచ్ టెంకి శ్రీలత, తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్‌లు టెంకాయ కొట్టి ప్రారంభించారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించినందుకు గాను గ్రామ ప్రజలందరూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో మిషన్ భగీరథ పేరుతో పైపులైన్లు వేసిన తగిన విధంగా నీటి సరఫరా జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. చిర్రకుంట గ్రామానికి తక్షణ సాయం అందించినందుకు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ, పంచాయతీ కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ నాయకులు జనార్ధన్, సంపత్ రావు, సుధాకర్, సాయి, రమేష్, రాజేందర్, రాజశేఖర్, శ్యామేందర్ తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన ఎస్ఐ ఉదయ్ కిరణ్




**జన్నారం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

జన్నారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎస్‌బిఐ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్.ఐ ఉదయ్ కిరణ్, ఎస్.బిఐ మేనేజర్ అంకిత్‌లు ప్రారంభించారు. గత 16 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం వేసవిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల ప్రజల దహార్తిని తీర్చడానికి ఎస్.బి.ఐ వద్ద ఏర్పాటు చేసి బ్యాంక్ కస్టమర్లకు ఇటు మార్కెట్ స్థానిక ప్రజలకు చక్కగా ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ వాటర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ అనుమల రాజన్న తెలియజేశారు. స్థానిక ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తోట లచ్చన్న, కార్యదర్శి ఎర్ర ప్రవీణ్ కుమార్, క్లబ్ ట్రెజరర్ ప్రేమ్ సాగర్, క్లబ్ జోన్ చైర్ పర్సన్ కస్తూరి సతీష్, డిస్టిక్ కోఆర్డినేటర్లు ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జక్కు భూమేష్, అంజితరావు, లయన్స్ క్లబ్ సభ్యులు మారుతి రాజు, సైన్ల మల్లేష్, వెలగందుల సురేష్, గుండ పవన్, వావిలాల రాజేందర్, గుండ సుధాకర్, మిక్కిలినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మత్తు పదార్థాలు, ఓటిపి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

## జన్నారంలో మత్తు పదార్థాలు, సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన

**జన్నారం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

మత్తు పదార్థాల వినియోగం, బ్యాంకు ఓటీపీ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జన్నారం పోలీసులు సోమవారం సాయంత్రం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. వీటి అమ్మకాలు, వినియోగం చట్టరీత్యా నేరం. ఎక్కడైనా డ్రగ్స్ అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వండి అని సూచించారు. బ్యాంకు ఓటీపీ మోసాలపై మాట్లాడుతూ, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు అధికారులమని చెప్పి ఓటీపీ, కార్డు నెంబర్ అడుగుతారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పొద్దు. బ్యాంకు వారు ఎప్పుడూ ఓటీపీ అడగరు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు, మహిళలు యువత పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులు షీటీమ్స్, డయల్ 100 సేవల గురించి కూడా అవగాహన కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట మండలం కొత్తూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హాజీపూర్ మండలం సబ్బుపల్లికి చెందిన తురుపాటి పౌల్ (44) సంవత్సరాల వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. మృతుడు వృత్తిరీత్యా గ్రామాల్లో తిరుగుతూ గ్యాస్ స్టవ్ రిపేర్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన వృత్తిలో భాగంగా తనకున్న యూనికాన్ బైక్ పై దండేపల్లి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న జీప్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

## కిశోర బాలికలకు అవగాహన సదస్సు

**తాండూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు బాల్య వివాహాలు, చిన్న వయసులో పెళ్లిళ్ల చేయడం, గర్భం దాల్చడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. టీనేజ్ వయసులో ఉండే ఆకర్షణ, శారీరక, మానసిక మార్పుల గురించి వివరించారు. ఈ వయసులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత భద్రత, శ్రేయస్సు కోసం పాటించాల్సిన సూచనలు చేశారు. బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని, ఎక్కడైనా జరిగితే తమకు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారాయణ, కేజీబీవీ ఎస్ఓ కవిత, హెల్త్ సుపర్ వైజర్ తార, ఎన్ఎంఎస్ శోభారాణి, తిరుపతమ్మ, సిల్డ్ హెల్ప్ లైన్ సుపర్ వైజర్ వరలక్ష్మి, ఐసీడీఎస్ సుపర్ వైజర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

# అర్హులకు రెండు పడక గదుల ఇండ్లు

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 28, ప్రభాతవార్త



అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో గల రెండు పడక గదుల ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కనిపించే ఉద్దేశంతో చేపట్టిన రెండు పడక గదుల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

హాజీపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

హాజీపూర్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ, గత నెల రోజుల నుంచి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి, ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందని ఎర్రని ఎండలో పడిగాపులు కాస్తున్నారు. కానీ వాళ్ళను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం రైస్ మిల్లర్ల చర్చల పేరుతో రైతులకు తీవ్ర ఇబ్బందుల పెట్టడమే కాకుండా, వాతావరణంలో మార్పులు వచ్చి అకాల వర్షాలు గిట్ల వస్తే రైతులు పూర్తిగా తాము పండించిన పంట నష్ట పోయే ప్రమాదం ఉంది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వం ఈ జిల్లా కలెక్టర్ వహించాల్సి ఉంటుందని అన్నారు. గతంలో రైస్ మిల్లర్లు రైతులు పండించిన ధాన్యంలో మంచిర్యాల జిల్లాకు సంబంధించి దాదాపు 30 రైస్ మిల్లుల లో దాదాపు 250 కోట్ల రూపాయల పైన కుంభకోణం చేశారని, ఇప్పటివరకు సొమ్ము రికవరీ కోసం ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకో పోవడం చూస్తే అధికారులు కూడా ఈ స్కామ్ లో పాలు పంచుకుంటున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రైతు ప్రభుత్వం ప్రజా ప్రభుత్వ పాలన అని చెప్పే కాంగ్రెస్ పార్టీ ఇన్ని రోజుల నుండి కళ్ళల్లో ఉన్న ధాన్యాన్ని తరలించకపోవడం చూస్తే కాంగ్రెస్ పార్టీకి రైతులపై ఎంత ప్రేమ ఉన్నదో అర్థమవుతుందన్నారు. వెంటనే రైతుల పట్ల సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కాశెట్టి నాగేశ్వరరావు, తుల మధుసూదన్ రావు, బొలిశెట్టి తిరుపతి, మడిపల్లి సత్యం, గందెశ్రీ శ్రీనివాస్, దాస్య నాయక్, రైతులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జయప్రదం చేయండి

కెరమెరి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:



మాట్లాడుతున్న సొసైటి సంఘాల సభ్యులు

ఈనెల 29న కెరమెరిమండలంలోని గోయగాం గ్రామంలో జరగనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భారతీయ బౌద్ధమసభ, సెంటర్ కమిటీ, సమతా సైనిక దళ్, భీం సేన, సమతా సొసైటీ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహల్కార్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కమిటీ చైర్మన్ నగరారే తారు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. చిన్న గ్రామమైన గోయాగాం లో ఈకార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి గాయకులు, బాలీవుడ్ సినిమా కళాకారులు, వస్తున్నారని వారితోపాటు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ యు జిల్లా కార్యదర్శి చునార్కర్ తుకారాం ఉప్రే వినేశ్ దుర్గం శ్యాంరావ్ అంబేద్కర్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మసదే ప్రశాంత్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ చునార్క రాజు డొ0గ్రే ప్రవీణ్ కమిటీ సభ్యులు దత్తు శంకర్ దత్తు పాల్గొన్నారు



# కోయవాగు గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు

## - సర్పంచ్ చింతపురి లక్ష్మి ఆధ్వర్యంలో నీటి సమస్య పరిష్కారం..

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలో మిషన్ భగీరథ మంచినీటి పైప్‌లైన్ దెబ్బతినడంతో గ్రామ ప్రజలు కొద్ది రోజులుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ చింతపురి లక్ష్మి వెంటనే స్పందించి మరమ్మత్తు పనులను చేపట్టాలని ఆదేశించారు. సర్పంచ్ ఆదేశాల మేరకు ఉపసర్పంచ్ మొరాయి శ్రీనివాస్ పర్యవేక్షణలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు అత్యవసర మరమ్మత్తులు నిర్వహించారు. దెబ్బతిన్న పైప్‌లైన్ భాగాన్ని తవ్వించి, లీకేజీ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి వాల్వ్ సరిచేయడంతో పాటు పైప్‌లైన్‌ను సక్రమంగా పునరుద్ధరించారు. దీంతో తాగునీటి సరఫరా తిరిగి ప్రారంభమై ప్రజలు ఉపశమనం పొందారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ చింతపురి లక్ష్మి, ఉపసర్పంచ్ మురారి శ్రీనివాస్, సంబంధిత సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఇటువంటి సమస్యలను తక్షణమే పరిష్కరించడం గ్రామపంచాయతీ బాధ్యతగా భావిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదే శ్రీనివాస్, మారుతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీబి నిర్మూళనపై అవగాహన

తాండూర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :



టీవీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరం

తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అచలాపూర్, బల్హన్పూర్ గ్రామాల్లో మంగళవారం టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. సందర్భంగా టీబీ వ్యాధి లక్షణాలు, టీబీ వ్యాధి నిర్మూలలపై ఆరోగ్య కేంద్రం, డాక్టర్, సూపర్వైజర్లు తెలుగు అవగాహన కల్పించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్ష ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ.1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్ని రకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. తగిన జాగ్రత్తలు లక్షణాల గురించి వివరించారు సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో డాక్టర్ ఝాన్సీ రాణి, ఆరోగ్య సిబ్బంది ప్రసన్న, దౌలత్, రమాదేవి, శ్రీనివాస్, స్రవంతి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలో మునిగి పశువుల కాపరి మృతి

హాజీపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త

ముల్కల్ల గ్రామ శివారులో గోదావరి నదిలో మునిగి పశువుల కాపరి కయితీ మల్లయ్య (66) మృతి చెందాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై కిరణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని రంగంపేటకు చెందిన మల్లయ్య పాత మంచిర్యాల గ్రామానికి చెందిన ముదాం ఉమాకర్ వద్ద గేదెలను కాస్తుంటాడు. గేదెలను కాయడానికి ముల్కల్ల గ్రామ శివారులోని గోదావరి వైపు మల్లయ్య వెళ్లాడు. సాయంత్రం వేళ నీటిలో ఉన్న గేదెలను ఒడ్డుకు తీసుకురావడానికి నదిలోకి దిగాడు. నీటి లోతు ఎక్కువగా ఉండటంతో ప్రవాహంలో గల్లంతయ్యాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు కుమార్, కుమార్తెలు మానస, మల్లీశ్వరి ఉన్నారు. మృతుడి కుమారుడు కయితీ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.